# ఎవరిధోరణి వారిది.

రచన :
శ్రీమతి. పరానేని శ్రీశైల భ్రమరాంబ.

'ఏమండీ లెక్చరర్ రాధా కృష్ణమూర్తి గారిఇల్లుఇదేనాండి?' అంటూ గుమ్మంలోనే నిల్చుని అడిగింది సుబ్బాయమ్మగారు.

'అవునండి. వారు కాలేజికి వెళ్లారు - మళ్లీ సాయంత్రం కానిరారు'. అని జవాభిచ్చింది. ఇరవైరెండేళ్ల ఆమె.

'పోనీ ఆయనభార్య మహాలక్ష్మమ్మగారు ఇంట్లో ఉన్నారా?' అంటూ చేతి సంచితో గుమ్మాలెక్కి రిక్షా వాళ్లచేత సూట్ కేస్ అరుగుమీద పెట్టించి, కొంగున కట్టిన డబ్బులు ఇస్తూ అడిగింది.

'ఆవిడ మ్యాటినీ సినిమాకి వెళ్లారు. వచ్చేసరికి ఆరుగంటలవుతుంది'

'వారితాలుకు వారెవ్వరూకూడా ఇంట్లో లేరాండి? అసలువారు ఏ వాటాలో వున్నారు?'

'మీకు ఎవరితో మాట్లాడాల్సిన పనుందో చెప్పండి'

'నేను మాట్లాడి వెళ్లిపోవడానికి రాలేదండి. వారి పిల్లలైనా వుంటే చెప్పండి-వాళ్లు మేము కావల్సిన వాళ్లం'

'అయితే వాళ్లనిచూస్తే మీరు గుర్తించగల్గేటంతగా ఎరుగుదురన్నమాట' నవ్వుతూ అడిగింది.

'వాళ్లుమేము చాలా దగ్గర బంధువులమేనండి. వారింట్లో ఎవరిని చూచినాసరే; వాళ్లు నన్నూ గుర్తిస్తారు; నేను వాళ్ళనీ పోల్చుకోగలను.'' అంటూ ఎంతో ధీమాగా చెప్పింది ఆవిడ.

అంతలో ఇంట్లోంచి పదేళ్ళ అమ్మాయి, ఆరేళ్ళ అమ్మాయి వచ్చారు.''అయితే వాళ్ళకి మీ రెల్లాంటి బంధువులండీ'' అంది పదేళ్ళ సుబ్బులు, (ఇప్పటి నాగరికత పేరులో సుజాతగా మార్చుకుంది)

''ఈ అమ్మాయి లిద్దరిపేర్లూ ఏమిటండీ?'' పల్లెటూరి అమాయత్వం మూర్తీభవిస్తూ అడిగింది.

''సుజాత, నిర్మల. మేం ముగ్గురమూ అక్కచెల్లెళ్ళ'' అంది ఆమె అడగబోయే ప్రశ్న తెల్సుకొని.

''మీరు అన్నదమ్ము లెందరండి?''

''అయిదుగురు. నేనే మొట్టమొదటిదాన్ని - నిర్మల ఆఖరిది'' అని విపులంగా చెప్పింది.

''మీకు పిల్లలెందరండి?''

''ఇంకా అల్లాంటి వేమీ లేదండి - ఈ సంవత్సరంతోనే నా చదువు పూర్తయి ఉద్యోగంలో చేరా—మీరే ఊరినుంచి వచ్చారు?''

''మా సంగతి మీకెందుకుగానండి రాధాకృష్ణమూర్తి గారు కాపురం వుండేవాటా చూపించండి - వచ్చేవరకూ అక్కడే కూర్చుంటా'' అంటూ బింకంగా చెప్పింది సుబ్బాయమ్మ,

''సరే! అయితే ఇక్కడే కూర్చోండి వస్తారు'' అంటూ లోపలికి వెళ్లిపోయింది ఆమె.

అరగంట గడిచాక ముగ్గురు అబ్బాయిలు వచ్చారు. అబ్బాయిలంటే ఇరవై, పద్దెన్మిది పదహారు ఏళ్ళవాళ్ళు. వాళ్ళు లోపలికి వస్తూ గుమ్మంలోవున్న ఆవిడనుచూచి ''ఎవరికోసమండి?'' అని పల్కరించారు.

''అబ్బాయిలూ! ఇక్కడ లెక్చరర్ రాధాకృష్ణమూర్తి గారుండాలి. మీకు తెలుసా?'' అని అనుమానంతో మళ్ళీ అడిగింది.

''వారితో పనుండి వచ్చారాండి?'' అన్నాడు వారిలో పెద్దవాడు రాజారామ్.

''వాళ్ళు మావాళ్ళే నాయనా! ఇదివరకు ఈ యింట్లోనే వుండేవారు. ఇప్పుడుకూడా ఇక్కడే వున్నారని వచ్చా. కాని.........''

'ఇప్పుడూ ఇక్కడే వున్నారండి. ఈవాటా వారిదేనండి, వారు మీకేమవుతారు?''

ఆవిడ పెట్టి చేత్తో పట్టుకు హాల్లోకి వస్తూంటే ''అల్లా కూర్చోండీ'' అని కుర్చీ చూపించారు ఆ అబ్బాయిలు.

''మీరంతా కాలేజీ పిల్లల్లా వున్నారు....వారింట్లోవుండి

చదువుకొంటున్నారా?'' అందర్నీ పరీక్షగా చూచి అడిగింది.

''పరాయి వాళ్లవైతే వారింట్లో ఎందుకుంటారండీ?'' అంటూ ఆనిడ చాదస్తానికి నవ్వుకుంటూ అన్నారు ఆ పిల్లలు.

''ఇవ్వాళ ఆదివారంకదా! కాలేజీకి ఎల్లా వెళ్ళారు లెక్చరర్‌గారు?'' తీరని సందేహంతో అడిగింది ఆవిడ.

''ప్రయివేటు క్లాసుంది'' అని చెప్పేసి వారు ముగ్గురూ స్నానాలకి దొడ్లోకి వెళ్ళిపోయారు నాల్గు గంటలు కావడంచేత. వాళ్లు వెళ్ళిపోయాక ఆ ఇరవై రెండేళ్ళ ఆమె మాత్రం మల్లెపూల మాలకడ్తూ కూర్చుంది: సుబ్బాయమ్మగార్కి అది లెక్చరర్‌గారి ఇల్లు అవునో కాదో! అని వాగా సంశయంవచ్చి ఒకసారి ఇల్లంతా కలయజూచింది. పదేళ్ళ క్రిందట హాలంతా దేవుళ్ళ ఫొటోలతో అలంకరించి వుండేది. కాని నేడు అవేమీ లేవు. అంతా నైస్‌గా వుట్టిగోడలు—ఓసారి లేచి లోపలి గదిలోకి వచ్చింది. వరుసగా మూడు గదుల్లోనూ గదికి రెండేసి మంచాలు మాత్రం వున్నాయి, అది దోమ తెరలతో నవీన నాగరికతా పద్ధతిలో అమర్చబడి వున్నాయి. ముందుహాల్లో పెద్ద రౌండుటేబులు, దానిచుట్టూ అర డజను కుర్చీలు, ఓప్రక్క రెండు సోఫాలు, మూలగా చిన్నడ్రాయరు. ఓపడక కుర్చీవుంది. హాల్లో ఓపెద్ద బీరువామాత్రం వుంది. గోడకు నిలువుటద్దం వ్రేల్లాడుతోంది.

తిన్నగా దొడ్డివైపు వరండాలోకి వెళ్ళింది. అక్కడ ఒక్క సామానుకూడా కన్పించలేదు, ఎంతో బొరవగా వంటింటి తలుపుతీసి లోపలికి వెళ్ళబోయేసరికి పువ్వులు మాలకడ్తూన్న ఆమెవచ్చి ''ఏమిటండీ ఇల్లంతా చూస్తున్నారు'' అంది మామూలుగా.

''అబ్బే ఏంలేదండీ'' అంటూ ఆశ్చర్యంగా వంటిల్లు పరకాయించి చూస్తోంది.

వంటింట్లో నాల్గువైపులా పెద్దపెద్ద అలమారులు తలుపులు వేసివున్నాయి. ఓ పెద్ద బీరువామాత్రం వుంది. వండిన వంటకాలుకూడా పెట్టుకోడానికి కాబోలు ఓ పెద్ద గూడు కిటికీ అంతవుంది దానికీ తలుపులు వేసివున్నాయి. క్రింద వుతికబిందెలు నీళ్లు పట్టే గుండిగ, ఓ చిన్నబిందె తప్పించి మరే ఇతరసామాగ్రి లేకపోవడంతో. ఇంక ఈ యిల్లు తను అనుకొన్న వారిల్లుకాదని....అందులోనూ ఈ యింట్లోవాళ్లు అసలు వంటకూడా చేసుకొనేవాళ్ల కారని మనస్సులో నిశ్చయించుకుని వెంటనే మళ్ళీముందు హాల్లోకి వచ్చేసింది.

''మీరే ఊరినుంచి వచ్చారండీ?'' అంది ఆమె సుబ్బాయమ్మగారి పల్లెటూరి వాలకాన్ని కనిపెట్టి.

''లెక్చరర్‌గారు కలపుల్లో వారికుటుంబాన్ని తీసుకుని 'మేడపాడు' వెడ్తున్నారా?'' అనడిగింది.

''మేడపాడు ఎందుకండీ? అక్కడ ఏముందని?'' కొంచెం ఆశ్చర్యంగా అడిగింది.

''వారి స్వంతఇల్లు, పొలముగట్రా వున్నాయికదూ! ఆయన తల్లిగారు మేడపాడులోనే వున్నారుగా.''

''ఆయనకి తల్లితండ్రి, భూమిబుట్రా, ఇల్లువాకిలీ ఏమీలేవు అక్కడ. పదేళ్ళ మధ్యలో ఆయన ఎన్నడూ ఎక్కడికీ వెళ్ళలేదు'' అంది ఆమె.

''అదంతా మీకేం తెలుస్తుంది లెండి - వారికి అఊళ్ళో నాలుగిళ్ళ భవంతి పెద్దమండువా లోగిలివుండండి. నాలుగెకరాల పల్లపు భూమి ఓహోమంటూ పండేదివుంది. ఆయన భార్య మహాలక్ష్మమ్మకి ఒళ్ళంతా బంగారమే, ఆయన ఎంత పెద్ద లెక్చరర్ అయినా పెళ్లాంమాత్రం పూర్వకాలపుదే. అంతా సత్యకాలపు పిల్ల మామా చెమ్మ (మహాలక్ష్మమ్మ) పదేళ్ళ క్రిందట వారింటికి అప్పటికి వాళ్ళకి పెళ్ళీడుకొచ్చిన పన్నెండేళ్ళ పిల్లకూడా వుండేది. తర్వాత వరుసగా వుండేవారు పిల్లలు—అప్పుడు ఈ వరస చిన్నగదులు మూడూమాత్రం అద్దెకు తీసుకొన్నారు. ఇప్పుడు అంటికి రెండురెట్లు తీసుకున్నారు కాబోలు.''

''ఈ ఇల్లు వారిస్వంతమేనండి. వారికి అవసరమైనంతవరకూ వుంచుకు మిగిలినభాగం అద్దెకిచ్చారు.''

''అయితే వీళ్ళు మావాళ్ళు కాదండి — రాధాకృష్ణమూర్తిగారిల్లు ఇదేనంటే కూర్చుండిపోయా....వెళ్లొస్తా

నండి'' అంటూ లేచి నిల్చుంది సుబ్బాయమ్మ.

''పోనీ మీపేరేమిటో; ఎక్కడనుంచి వచ్చారో; ఎట్లాంటి బంధువులో చెప్తే అవునో; కాదో; తెలుస్తుంది కదాండి''' అంది ఆమె.

''మాది బండార్లంక - మహాలక్ష్మమ్మ మాచెల్లెలు. పదేళ్ళక్రిందట దానికి జబ్బుచేసినప్పుడు వచ్చాను. ఓ వారం రోజులుండి వెళ్ళిపోయాను. అప్పటినుంచీ మళ్ళీ వాళ్ళసంగతి నాకు తెలియకపోయినా, ఓసారి చూచి పోదామని వచ్చాను. తీరా ఇక్కడికి వచ్చాక....ఇల్లు ఇదివరకుదే అయినా ఇంట్లో వాళ్ళుమాత్రం మాబంధువులు కారని తెల్సిపోయింది.''

''అయితే ఇప్పుడు తెల్సింది లెండి. నిర్మల పుట్టాక మా నాన్నగారు ఆపరేషన్ చేయించుకొన్నప్పుడు మా అమ్మ చెప్పారు - బండార్లంకలో ఆవిడ అక్కగారు వున్నారని, ఆవిడను సహాయంగా రమ్మంటానని అన్నారు....కాని.''

''ఆపరేషన్ చేయించుకొన్నారా? ఆయనికి గిలక ఏమీలేవే?''

''అబ్బే! అదేంకాదండి. ఇప్పుడు క్రొత్తగా పిల్లలు పుట్టకుండా మగవాళ్లు....''

''అయితే అదెవరో! ఆయనే కృష్ణమూర్తో! మామ రదిగారుమాత్రం అల్లాంటి-పాడుపని చెయ్యరు!! చేస్తానన్నా మాచెల్లెలు ఛస్తె ఒప్పుకోదు!!! అంటూ పూర్వాచార పరాయణత్వం ఒలకబోస్తూ బి. సి. నాటి పరమ ఛాంచసంగా చెప్పింది.

''ఆవిడే పట్టుబట్టి చేయించుకో మన్నారండి. ఆవిడైనా అంత తెలివితక్కువదికాదు, ప్రతీరోజూ మహిళా మండలిలో ఉపన్యాసాలు ఇస్తూవుండి, లేడీస్ క్లబ్‌కి ప్రెశిడెంటుగావుండి, అందరికీ నీతులు బోధిస్తూ తను ప్రతీఏటా పిల్లల్నికంటూ ఆరోగ్యాన్ని చెరుచుకోవడం ఇష్టంలేకనే నాన్నగారి అభిప్రాయాన్ని బలపర్చి ప్రోత్సహించారు.'' అంది ఆమె.

''అయితే ఆవిడ మాచెల్లిమాత్రం కాదు. ఇంట్లో వాళ్ళ మాటకే జవాబివ్వలేనిది, వీధులో ఉద్యోగంచేస్తాందంటే ఎల్లా నమ్మగలను?... అయితే మీకు పెళ్ళయ్యిందా? మీ అత్తవారు ఏఊరు?...'' అంటూ ఆమె ముఖంలోకి చూస్తూ అడిగింది ఆవిడ.

''నాకింకా పెళ్ళికాలేదు, ప్రస్తుతంలో ఇక్కడే ఓ నర్సింగుహోమ్‌లో పనిచేస్తున్నా - తమ్ముళ్లు చెల్లెళ్ళు ఇంకా చదువుకొంటున్నారు. పెద్ద తమ్ముడికి ఈసంవత్సరంలో 'లా' పూర్తవుతుంది.''

ఈమాట వినేసరికి సబ్బాయమ్మగారికి మనస్సులో కంపరమెత్తి అసహ్యత కల్గింది. నిజంగా తన చెల్లెలు కూతురే అయితే నర్సు పనిచెయ్యనిస్తుందా? ఇంక అక్కడ ఒక్కక్షణంకూడా వుండ బుద్ధికాక లేచి నిల్చుంది వెళ్ళిపోవాలని.

''లేచారేమండీ! మీరు మాకు పెత్తల్లిగారని తెల్సాక కూడా మిమ్మల్ని గౌరవించకుండా ఎల్లావుండం? లోపలికి వచ్చి మీకు ఏంకావాలో తీసుకోవచ్చు. స్నానం చేస్తారేమో అల్లా బాత్‌రూమ్‌కి వెళ్ళండి'' అంది ఆమె.

''అయితే నీపేరేమిటి అమ్మాయీ!''

''పద్మావతి.''

''సరేనండి .... వెళ్లొస్తా....ఏదో తెలియనిదాన్ని - ఇల్లుమర్చి పోయానేమో! ఏమిటో నేనోక్కర్తిని రావడమేమిటి?....అంటూ ఎదో గొణుక్కొంటూ పెట్టె ఓ చేత్తోనూ, సంచీ రెండో చేత్తోను పట్టుకు గుమ్మాలుదిగి వెళ్ళిపోయింది సుబ్బాయమ్మ.

కొంచెందూరమైనా వెళ్ళకుండానే కృష్ణమూర్తిగారు ఆయన భార్య కల్సి వస్తూంటే చూసికూడా వెళ్ళిపోయింది సుబ్బాయమ్మ. తన చెల్లెలు కొట్టొచ్చే పూర్వాచారంతో వెలిగిపోతుందే కాని....కాళ్ళకి కడియాలు, గొలుసులు, మువ్వల పట్టాలతో ఘల్లు ఘల్లుమంటూ, చేతికి పన్నెండు జతల బంగారు గాజులతోగలగల్లాడ్తూ, తలలో నాగరం, రాళ్ళ చేమంతిపువ్వు వెనుకు గుండ్రని సిగచుట్టి, చేతులకి దండపంకీ, నాగపూర్ రాళ్ళవంకితో, మెడ త్రిప్పుకోలేవన్ని వస్తువులతో, నడుముకి మువ్వల వడ్డాణంతో గోచీపోసి చీర కట్టుకొనే తన చెల్లెలెక్కడ? ఈ ఏదురొచ్చే ఆవిడెక్కడ? ఏదోకొంచెం పోలిక

(తరువాయి 26 వ పేజీలో)

(9వ పేజీ తరువాయి)

మాత్రం వుందేమో?.... ఈ కృష్ణమూర్తి భార్యలా కాలికి కంటికి జోడు, చేతికి వాచీ, ఒంటిమీద నగలైనా లేకుండా ఓక్రేప్ సిల్కు చీర కట్టుకు సిగ్గులేకుండా మగవాడితో సమానంగా నడిచి వస్తుందా? అని మనస్సు ఊహించుకొంటూ గిర్రున వాళ్ళని దాటుకు వెళ్ళిపోయింది సుబ్బాయమ్మ.

ఇంటికి వచ్చిన తల్లితో పద్మావతి అంతకుముందు వచ్చిన సుబ్బాయమ్మనుగురించి చెప్పేసరికి అంతా అగమ్యగోచరంగా కన్పించింది ఆమెకి. అయినా తన అక్కగారేనన్న ఆశతో ఎల్లాగైనా ఓసారి ఆవిడకోసం వెతికిచూచి తీసుకురమ్మంది. చీకటిపడేవరకూ సుబ్బాయమ్మగారికోసం వెదికారే కాని ఆవిడ వుండేస్థలం మాత్రం వారెవ్వరూ గుర్తించనేలేదు. హోటల్సుల్లోనూ, లాడ్జిల్లోను, పార్కుల్లోనూ, బీచి ఒడ్డునా వెతికితే మాత్రం చిన్న ధర్మసత్రంలో తలదాచుకొన్న సుబ్బాయమ్మ వీరికి కన్పిస్తుందా? మేడపాడులోవుండే పొలమంతా అమ్మి విశాఖపట్నంలో తాము కాపురంవుండే ఇల్లును కొన్నారనిగాని, నాలుగిళ్ళ భవంతి అయినా తమకు నిరుపయోగమని ఆ యిల్లు అమ్మివేసి పిల్లల చదువుకు వినియోగించారని గాని, ఆర్థిక ఇబ్బందులో మహాలక్ష్మమ్మగారి బంగారమంతా హారతి కర్పూరంలా హరించుకుపోయిందని ఆవిడ కేంతెలుసు? నర్సింగ్ హోమ్‌లో పనిచేస్తోందనగానే నర్సుపనే అనుకొందిగాని యం. బి. బి. యస్. ప్యాసైన డాక్టరమ్మ అని అపల్లెటూరిసుబ్బాయమ్మ ఎల్లా గుర్తించగలదు? చిన్నప్పుడు పెట్టిన పళ్ళాలమ్మ పేరు పద్మావతిగా మారిపోయిందని ఎల్లా అనుకుంటుంది? పోనీ పదేళ్ళక్రిందట చూచిన పెత్తల్లినికూడా పద్మావతి గుర్తించలేకపోవడం పొరబాటు అనుకొందామంటే? ఆనాడు సన్నంగా బక్కబలుచగావుండే పుణ్యస్త్రీ సుబ్బాయమ్మ ఈనాడు అంతకు పదిరెట్లు ఆకారం పెరగడమే కాకుండా భుజంమీది కొంగు బుర్రమీదికెక్కిన వితంతువాయె.... కనీసం తమ యోగక్షేమ సమాచారాన్నయినా ఆవిడకు తెలియజేద్దామనుకొన్నాగాని; తొమ్మిది సంవత్సరాలక్రిందట సుబ్బాయమ్మ భర్త పోయినప్పుడు ఒక్కసారైనా అవిడను చూచి వద్దామంటె మహాలక్ష్మమ్మకు అవకాశం చిక్కనేలేదు. తను వంటరిగా వెళ్ళాలన్నా కష్టతరమైన ప్రయాణం. రైలు బస్సు, బండి. నావ, గోదావరిమీద ప్రయాణానికి భర్త తోడుగా వుంటేనే కాని వెళ్ళలేదు. అదీకాక ఈ దశనుంచీ పిల్లల చదువులతో ఆర్థికస్థితి బాగుండక రోజులు గడవడమే కష్టమయ్యేది. అటువంటిది కష్టకాలంలో కన్నతల్లిలాంటి అక్కయ్యకు వైధవ్యం వచ్చినా చూడలేని తను ఏముఖంతో ఉత్తరంమాత్రం వ్రాయగలదు? అల్లాగే హఠాత్తుగా ఆ అక్క చెల్లెళ్ళిద్దరి మధ్యా రాకపోకలేకాకుండా, ఒకరి సంగతులొకరికి తెల్సుకొనే అవకాశంకూడా దూరమైపోయింది, కొన్ని నెలల నుంచి కూతురు డాక్టరుగా సంపాదిస్తోంటే ఆర్థికలోపం లేకుండా హాయిగా గడుస్తోంది మహాలక్ష్మమ్మ సంసారం. కొన్నాళ్ళు తన అక్కగారింటికెళ్ళి రావాలనుకొంటోంది ఆవిడ. కాని తీరా అక్కగారే స్వయంగా వచ్చినప్పటికి పూర్వపు దశధోరణిలో ఆవిడ, ఇప్పటి ధోరణిలో తన పిల్లలు మాట్లాడ్డంతో ఎవరి ధోరణి వారిది ఆయిపోయింది.

ఏనాడూ ఇల్లుకదలి ఎరుగని సుబ్బాయమ్మ తనకుతానై చెల్లెల్ని పిల్లల్ని చూడాలని గంపెడాశతో వచ్చి.... వాల్తేరువంటి మహాపట్నంలో వారిని గుర్తించలేక మర్నాడు స్వగ్రామం వెళ్ళడానికి ట్రయిను ఎక్కింది.

---

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము యేమాత్రమూ భాద్యులుకాము.

— సంపాదకుడు.

**Edited and Published by A, N, Raghavachar, No, 32, Krishnappa Naik Tank St,, Madras-1**
**Printed by V, Kuppuswamy Chetty, Bharathmata Press, No, 39, Anderson St,, Madras-1**